

PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

జర్నలిస్ట్ శక్తి ప్రజల పక్షం
జర్నలిస్ట్ సంక్షేమం లక్ష్యం
TJWA
Regd. No: 288/2026
తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్
తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం
జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ – సంక్షేమమే మా ధ్యేయం

గురువారం 29 అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి: 02 . సంచిక : 148 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

తాండూరు కందులకు అంతర్జాతీయ గుర్తింపు.. ఆస్ట్రేలియాకు తొలిసారి ఎగుమతి





హైదరాబాద్, అక్టోబర్ 29 – నందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిన తాండూరు కందులు తొలిసారిగా ఆస్ట్రేలియా మార్కెట్‌లోకి అడుగుపెట్టాయి. భౌగోళిక గుర్తింపు (జిఐ ట్యాగ్) పొందిన ఈ కందుల ఎగుమతికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి ప్రాధికార సంస్థ (అపెడా) సహకారం అందించింది. బుధవారం హైదరాబాద్ నుంచి తొలి ఎగుమతి సరుకును హైబ్రిడ్ విధానంలో జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ, సహకార శాఖ ప్రభుత్వ కార్యదర్శి నురేంద్ర మోహన్ (ఐఏఎస్), హైదరాబాద్ అపెడా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్.పి. నాయుడు వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయానికి చెందిన అదనపు విదేశీ వాణిజ్య డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంపత్ కుమార్ (ఐటీఎస్), ఎం/ఎస్ దుర్గా ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ సంస్థ ప్రతినిధి, ఎగుమతిదారు నుమంత్ ఆర్., అపెడా అధికారులు పాల్గొన్నారు. తొలి విడతలో భాగంగా 2.5 మెట్రిక్ టన్నుల తాండూరు కందులను హైదరాబాద్‌కు చెందిన దుర్గా ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ సంస్థ 'అమ్మాస్' (AMMAAS) బ్రాండ్ పేరుతో ఎగుమతి చేస్తోంది. సముద్ర మార్గం ద్వారా ఆస్ట్రేలియాకు చేరనున్న ఈ సరుకును అక్కడి భారతమ్మ పీటీవై లిమిటెడ్ సంస్థ దిగుమతి చేసుకోనుంది. అపెడాలో నమోదైన దుర్గా ఎక్స్‌పోర్ట్స్ సంస్థ ఇప్పటికే తెలంగాణ నుంచి బియ్యం, పప్పుధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, ఇతర కిరాణా ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేస్తోంది. తాండూరు కందులకు అంతర్జాతీయ మార్కెట్‌లో గుర్తింపు లభించడం తెలంగాణ వ్యవసాయ రంగానికి కీలక పరిణామంగా భావిస్తున్నారు. తాండూరు, బషీరాబాద్, పెద్దేముల్, యాలాల మండలాల్లోని వర్షాధార భూముల్లో ప్రధానంగా సాగయ్యే ఈ కందులకు అక్కడి నేలల ప్రత్యేక స్వభావం, భౌగోళిక పరిస్థితులు ప్రత్యేక లక్షణాలను అందిస్తున్నాయి. లోతైన నల్లరేగడి నేలలు, అటుపుల్లెట్ బంకమట్టి ఖనిజాలు, నున్నపురాయి నిక్షేపాలు ఈ పంట ప్రత్యేకతలకు దోహదపడుతున్నాయి. తాండూరు కందుల్లో సుమారు 22 నుంచి 24 శాతం మాంసకృత్తులు ఉండటం, మంచి రుచి, వంటకు అనుకూలత, నిల్వ ఉండే గుణం వీటి ప్రత్యేకతలుగా గుర్తింపు పొందాయి. తెలంగాణ నుంచి జిఐ గుర్తింపు పొందిన తొలి వ్యవసాయ ఉత్పత్తిగా తాండూరు కందులు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఈ గుర్తింపు వల్ల ఉత్పత్తి ప్రాంతానికి ప్రత్యేకమైన వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో గుర్తింపు పెరగడంతో పాటు, నాణ్యత ఆధారంగా మెరుగైన ధరలు పొందేందుకు అవకాశాలు ఏర్పడతాయి. దేశంలోని జిఐ గుర్తింపు పొందిన వ్యవసాయ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు పరిచయం చేయడంలో అపెడా కీలక పాత్ర పోషిస్తోంది. ఎగుమతిదారులకు మార్కెట్ అనుసంధానాలు కల్పించడం, వాణిజ్య ప్రదర్శనల్లో పాల్గొనే అవకాశాలు అందించడం, విదేశీ మార్కెట్లలో ప్రవేశానికి అవసరమైన మార్గదర్శకత్వం కల్పించడం వంటి చర్యలు చేపడుతోంది. రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, ఎగుమతిదారులకు కొత్త మార్కెట్లను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తోంది. ఆస్ట్రేలియాకు తాండూరు కందుల తొలి ఎగుమతి జరగడం ద్వారా తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు మరిన్ని విదేశీ మార్కెట్లను అన్వేషించే అవకాశం ఏర్పడింది. ఈ పరిణామం రైతులు, ఉత్పత్తిదారులు, ఎగుమతిదారులకు కొత్త అవకాశాలను అందించడంతో పాటు తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పెంచేందుకు దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

నిరుద్యోగులకు మంత్రి పొంగులేటి జన్మదిన కానుక.. పీఎస్ఆర్ యువ నేస్తం ద్వారా ఉచిత శిక్షణ



హైదరాబాద్, అక్టోబర్ 29 – నందేశం టైమ్స్ ప్రతినిధి: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన జన్మదినం సందర్భంగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'పీఎస్ఆర్ యువ నేస్తం' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందించనున్నట్లు ప్రకటించారు. ప్రతిష్ఠాత్మక ఆర్సీ ఎగ్జామ్స్ సంస్థ సహకారంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం ద్వారా ఎంతమంది అభ్యర్థులకైనా శిక్షణ అందిస్తామని, ప్రస్తుతానికి లక్ష మందికి పైగా పేర్లు నమోదు చేసుకున్నారని మంత్రి వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తన ఛాంబర్‌లో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణ అందించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన మార్గదర్శకత్వం కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ శిక్షణ ఏడాది పాటు కొనసాగుతుందని, అవసరాన్ని బట్టి గడువును మరింత పొడిగిస్తామని స్పష్టం చేశారు. అభ్యర్థులు హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్‌లో శిక్షణ పొందవచ్చని, ప్రయాణ ఖర్చులు, వసతి భారాలు లేకుండా ఈ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. సాధారణంగా పోటీ పరీక్షల శిక్షణకు ఒక్కో అభ్యర్థికి సుమారు రూ.లక్ష వరకు ఖర్చవుతుందని, పుస్తకాలు, ఇతర శిక్షణ సామగ్రి కోసం రూ.14 వేల నుంచి రూ.30 వేల వరకు వ్యయం అవుతుందని పేర్కొన్నారు. ఈ ఖర్చులన్నింటినీ ట్రస్ట్ భరిస్తుందని, అభ్యర్థులకు శిక్షణతో పాటు అవసరమైన పుస్తకాలు, ఇతర సామగ్రిని ఉచితంగా అందిస్తామని తెలిపారు. గతంలో ఖమ్మం ప్రాంతంలో నిరుద్యోగ యువత కోసం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సుమారు 2,300 మందికి శిక్షణ అందించగా, వారిలో 462 మంది వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు సాధించారని గుర్తుచేశారు. ఆ అనుభవమే రాష్ట్రవ్యాప్తంగా మరింతమంది యువతకు శిక్షణ అందించాలనే ఆలోచనకు ప్రేరణగా నిలిచిందన్నారు. ఆర్సీ ఎగ్జామ్స్ సంస్థకు మూడు దశాబ్దాల అనుభవం ఉందని, నిపుణులైన అధ్యాపకులు, ఫ్యాకల్టీ సభ్యుల మార్గదర్శకత్వం అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే రెండేళ్లలో 72 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు మంత్రి తెలిపారు. త్వరలో మరో 15 వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువత ఆర్థిక ఇబ్బందులు, శిక్షణ ఖర్చుల కారణంగా వెనుకబడకూడదనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వివరించారు. ఇదే సందర్భంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై కూడా మంత్రి కీలక ప్రకటన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన సమయంలో పాత్రికేయుల ఇళ్ల స్థలాల సమస్యపై చర్చించామని, రానున్న దీపావళిలోగా ఈ సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి అంగీకరించినట్లు తెలిపారు. దీంతో దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారంపై ఆశలు చిగురించాయని పాత్రికేయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమెరికా పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్న తెలంగాణ పర్యాటకం



హైదరాబాద్, అక్టోబర్ 29 – నందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక రంగానికి ఉన్న విస్తృత అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ అంతర్జాతీయ స్థాయిలో ప్రయత్నాలను ముమ్మరం చేసింది. డిసెంబరులో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 నేపథ్యంలో అమెరికాలోని పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు, మీడియా ప్రముఖులు, భారతీయ ప్రవాసులతో తెలంగాణ పర్యాటక శాఖ ప్రతినిధులు సమావేశమై పెట్టుబడి అవకాశాలను వివరించారు. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ (ఐఏఎస్) నేతృత్వంలో జరిగిన ఈ చర్చల్లో ముఖ్యంగా రాష్ట్రంలో గుర్తించిన ఎనిమిది ప్రత్యేక పర్యాటక ప్రాంతాల్లో (ఎస్‌టీఏలు) పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. ఆతిథ్య రంగం, పర్యాటక ఆకర్షణలు, మ్యూజియంలు, సాంకేతికత ఆధారిత సందర్శక సేవలు, డేటా ఆధారిత పరిష్కారాలు వంటి రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. హైదరాబాద్ నగరానికే పరిమితం కాకుండా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ప్రపంచస్థాయి పర్యాటక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, సందర్శకులకు మెరుగైన అనుభవాలను అందించడం ద్వారా కొత్త పెట్టుబడులకు మార్గం సుగమం చేయవచ్చని వివరించారు. ఈ సమావేశాల్లో న్యూయార్క్ మేయర్ కార్యాలయ డిప్యూటీ చీఫ్ బిజినెస్ డైవర్సిటీ ఆఫీసర్ దిలీప్ చౌహాన్, ఇండో-అమెరికన్ ఆర్ట్స్ కౌన్సిల్ ప్రచురణకర్త, సీఈఓ సునీల్ హాలి, సాంకేతిక రంగ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు అత్లూరి, రితేష్ పారిఖ్ తదితరులు పాల్గొన్నారు. నేషనల్ జియోగ్రాఫిక్ మాజీ వైస్ ప్రెసిడెంట్, ప్రచురణకర్త డాన్ డ్రూ తెలంగాణలోని పర్యాటక అవకాశాలను ప్రశంసిస్తూ, రాష్ట్రాన్ని భారతదేశంలో ఇంకా ప్రపంచానికి పూర్తిస్థాయిలో పరిచయం కాని అద్భుతమైన పర్యాటక గమ్యస్థానంగా అభివర్ణించారు. అమెరికా ప్రయాణికులు, పెట్టుబడిదారులు తెలంగాణను సందర్శించి ఇక్కడి ప్రత్యేకతలను తెలుసుకోవాలని సునీల్ హాలి పిలుపునిచ్చారు. న్యూయార్క్, హైదరాబాద్ నగరాల మధ్య పెరుగుతున్న అనుబంధాన్ని దిలీప్ చౌహాన్ ప్రస్తావించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, పర్యాటక రంగాన్ని తెలంగాణ ఆర్థికాభివృద్ధిలో కీలక రంగంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తెలంగాణ పర్యాటక విధానం ద్వారా 1.7 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు సుమారు మూడు లక్షల ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. పర్యాటక రంగం ద్వారా వయస్సు, లింగం, విద్యార్హతలతో సంబంధం లేకుండా వివిధ వర్గాల ప్రజలకు ఉపాధి, జీవనోపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఇదే క్రమంలో వాణి ప్రసాద్, పర్యాటక శాఖ డైరెక్టర్ రంజిత్ నాయక్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రతినిధి బృందం అమెరికాలోని మయామిలో జరుగుతున్న వరల్డ్ ట్రావెల్ ఎక్స్‌పో (డబ్ల్యూటీఈ)లో పాల్గొంటోంది. ఈ అంతర్జాతీయ ప్రదర్శనలో 70 దేశాలకు చెందిన 400కు పైగా ప్రదర్శకులు, పర్యాటక బోర్డులు, కన్వెన్షన్ అండ్ విజిటర్స్ బ్యూరోలు భాగస్వాములయ్యాయి. ఈ వేదికపై తెలంగాణను ప్రముఖ పర్యాటక, పెట్టుబడి గమ్యస్థానంగా పరిచయం చేసేందుకు ట్రావెల్ ట్రేడ్ ప్రతినిధులు, మీడియా సంస్థలు, పసిఫిక్ ఏషియా ట్రావెల్ అసోసియేషన్ (పీటీఏ) ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మయామి-డేడ్ కౌంటీ మేయర్ డానియెల్లా లెవిన్ కావా, మయామి బీచ్ మేయర్ స్టీవెన్ మినర్ కూడా తెలంగాణ పర్యాటక పావిలియన్‌ను సందర్శించి రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. అమెరికాలో చేపట్టిన ఈ ప్రచార కార్యక్రమం ద్వారా తెలంగాణలోని చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంతో పాటు విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, ఉపాధి అవకాశాలను పెంపొందించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

బీసీ కార్పొరేషన్లకు రూ.2,592 కోట్ల కేటాయింపులపై కమిషన్ అసంతృప్తి

హైదరాబాద్, అక్టోబర్ 29 – నందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలోని బీసీ సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న 22 కార్పొరేషన్ల ఫిడరేషన్లకు 2026–27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో సుమారు రూ.2,592.03 కోట్లు కేటాయించినప్పటికీ నిధులు విడుదల కాకపోవడం, ఖర్చు చేయకపోవడంపై రాష్ట్ర బీసీ కమిషన్ ఆసంతృప్తి వ్యక్తం చేసింది. ఆయా కార్పొరేషన్ల ద్వారా ప్రకటించిన పథకాలు చేపట్టకుండానే రెండేళ్ల పదవీకాలం ముగియడం శోచనీయమని అభిప్రాయపడింది. బుధవారం ట్యాంక్‌బండ్‌లోని కమిషన్ కార్యాలయంలో చైర్మన్ జి. నిరంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీసీల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, డాక్టర్ బాలలక్ష్మి రంగు, మెంబర్ సెక్రటరీ బి. బాల మాయాదేవి (ఐఏఎస్) పాల్గొన్నారు. సమావేశానికి ముందు సెంటర్ ఫర్ ఎకనామిక్ ఇండ్ సోషల్ స్టడీస్ (సెస్) డైరెక్టర్ ప్రొఫెసర్ ఇ. రేవతితో కమిషన్ సమావేశమై కామారెడ్డి, మంచిర్యాల, సంగారెడ్డి జిల్లాల్లో నివసిస్తున్న లోధ్ర కులస్తుల సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులు, జీవన స్థితిగతులపై అధ్యయనం నిర్వహించే అంశాన్ని చర్చించింది. ఈ అధ్యయనానికి సంబంధించిన విధివిధానాలపై ప్రొఫెసర్‌తో సంప్రదింపులు జరిపింది. బీసీల సంప్రదాయ కులవృత్తుల ప్రస్తుత పరిస్థితులు, ఆధునీకరణపై కమిషన్ ఇటీవలే అధ్యయనం ప్రారంభించగా, ఈ ప్రక్రియలో సెస్ సహకారం తీసుకోవాలని నిర్ణయించింది. సంప్రదాయ వృత్తులను ఆధునిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడంపై ఆయా కులాలకు చెందిన వృత్తులు, మేధావుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలని కమిషన్ నిర్ణయించింది. మరోవైపు ముదిరాజ్ కులస్తులు బీసీ-డి నుంచి బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలని చేస్తున్న డిమాండ్‌పై కమిషన్ సమగ్రంగా చర్చించింది. ఈ మార్పు వల్ల బీసీ-ఏ గ్రూపులోని 57 కులాలు, బీసీ-డి గ్రూపులోని 14 కులాలపై ఎలాంటి ప్రభావం పడుతుందో అధ్యయనం చేసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయపడింది. ఈ అంశంపై సమగ్ర వివరణనివ్వడానికి ఇదివరకే సెస్‌కు లేఖ రాసినట్లు కమిషన్ సభ్యులు గుర్తుచేశారు. ఈ విషయంపై సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ రేవతి మాట్లాడుతూ, సమగ్ర వివరణనివ్వడానికి కొంత సమయం కావాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులలో కులాల వారీ వివరాలు, విద్యా రంగంలో ఆయా కులాల ప్రాతినిధ్యం, స్థానిక సంస్థల్లో వారి ప్రాతినిధ్యానికి సంబంధించిన సమాచారం కూడా సంబంధిత శాఖల నుంచి అందాల్సి ఉందని వెల్లడించింది. ఈ వివరాలను పరిశీలించిన తర్వాతే ముదిరాజ్ కులస్తుల గ్రూపు మార్పుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది. ఇదే విధంగా బీసీ-డి నుంచి బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలని కోరుతున్న నగర, ఉప్పర కులస్తుల వినతులను కూడా ఆమోదయోగ్యమైన సమగ్ర సమాచారం అందిన తర్వాతే పరిశీలించాలని నిర్ణయించింది. కమిషన్ కార్యాలయంలోని గ్రంథాలయానికి బి.పి. మండల్ గ్రంథాలయంగా, సమావేశ మందిరానికి కె.ఎస్. ఆనంతాచారి సమావేశ మందిరంగా పేరు పెట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఆధునీకరించిన బి.పి. మండల్ గ్రంథాలయాన్ని సమంజస్ 1ని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి ఎన్. సునీత, సెక్రటరీ ఆదికారులు జి. సతీష్ కుమార్, కార్పొస్ బిస్ ఛటర్, రీసెర్చ్ ఆధికారి జి. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో కరువు ముప్పును ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు: భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబర్ 29 – నందేశం టైమ్స్ ప్రతినిధి: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడే వర్షాభావం, కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రజా ప్రభుత్వం ముందస్తు కార్యాచరణతో సిద్ధమవుతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. కరువు పరిస్థితులపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించామని, అవసరమైతే అఖిలపక్ష ప్రతినిధులతో కలిసి ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి అవసరమైన సహాయాన్ని కోరుతామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, తాగునీరు–సాగునీటి అవసరాలు, విద్యుత్ సరఫరా, రైతులకు ఎదురయ్యే ఇబ్బందులు, కరువు నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో భట్టి విక్రమార్క అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఎల్‌నినో నోడల్ అధికారి రామకృష్ణారావుతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. కాంగ్రెస్ తరపున అంజన్‌కుమార్ యాదవ్, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, బీఆర్ఎస్ నేతలు వినోద్‌కుమార్, ఎల్. రమణ, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీ, సీపీఐ నాయకులు వల్లా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చూడటం, సాగునీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం, రైతులకు అవసరమైన విద్యుత్ అందించడం, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు రూపొందించడం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలతోపాటు పశువులకు నీరు, మేత అందుబాటులో ఉంచడం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, వివిధ పరిస్థితుల్లో రాజకీయ విమర్శలకంటే ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని, అఖిలపక్ష నేతలు చేసిన సూచనలను పరిశీలించి సాధ్యమైన మేరకు ప్రభుత్వ కార్యాచరణలో చేర్చుతామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంపై గతంలోనే శాసనసభలో చర్చించడంతోపాటు శాస్త్రవేత్తలు, నిపుణులతో సంప్రదింపులు జరిపామని, పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించే చర్యలు చేపట్టిందని వివరించారు. రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాలు, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ వర్షపాతం లోటు ఏర్పడే పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని, ఇతర ప్రాంతాల నుంచి నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రిజర్వాయర్లలోని నిల్వలను దృష్టిలో ఉంచుకొని అందుబాటులో ఉన్న జలవనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి కొరత రాకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ప్రజలకు, పశువులకు అవసరమైన నీటి వనతుల కల్పనకు బడ్జెట్, ఇతర ఏర్పాట్లపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. అవసరమైన సహాయం కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పిస్తూ, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, సహకారం పొందేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, కరువు పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం సానుకూల, నిర్మాణాత్మక దృక్పథంతో ముందుకు సాగుతుందని, అంతర్రాష్ట్ర నదీజలాల అంశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలతోపాటు రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అఖిలపక్ష నేతలు వ్యక్తం చేసిన ఆందోళనలు, సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని తదుపరి కార్యాచరణను రూపొందిస్తుందని తెలిపారు. ప్రకృతి విపత్తు వల్ల ఎదురయ్యే సవాళ్లను సమన్వయంతో ఎదుర్కొనేందుకు అన్ని పార్టీలు సహకరించాలని, ప్రజలకు అండగా నిలవడమే లక్ష్యంగా ప్రభుత్వం బాధ్యతాయుతంగా చర్యలు చేపడుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.



ప్రభుత్వ ఉద్యోగులు ఏఐపై అవగాహన పెంచుకోవాలి: భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబర్ 29 – నందేశం టైమ్స్ ప్రతినిధి: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన పెంపొందించుకుని, రోజువారీ విధుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఏఐ వినియోగం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు వేగవంతం కావడంతోపాటు, సామాన్య ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కారం కావాలని స్పష్టం చేశారు. కార్యాలయాల్లో ఆదా అయ్యే సమయాన్ని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వినియోగించాలని సూచించారు.

హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో ప్రణాళికా శాఖ సహకారంతో టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో చేపట్టిన 'ఏఐ సాక్షమ్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగుల సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించి, పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులను గుర్తించడం, నివేదికలను రూపొందించడం, సమాచారాన్ని విశ్లేషించడం, ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరాలు అందించడం వంటి పనుల్లో ఏఐ సాధనాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఉద్యోగులు శిక్షణలో చురుగ్గా పాల్గొని, తమ విధులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఒక రైతు దరఖాస్తు త్వరగా పరిష్కారం కావడం, పింఛను

దీర్ఘకాలిక కడుపునొప్పితో బాధపడుతున్న ప్రైవేట్ ఉపాధ్యాయుడు మృతి



నర్సాపూర్, అక్టోబర్ 29 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు సురారం రమేష్ కుమార్ (40) బుధవారం తెల్లవారుజామున తన నివాసంలో మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం, రమేష్ కుమార్ మొహమ్మదాబాద్‌లోని ఎస్టీ గురుకుల పాఠశాలలో ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. సుమారు 15 సంవత్సరాల క్రితం సుష్మను వివాహం చేసుకోగా, వారికి సాయి కుమార్ (10), వర్షిక (8) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందినప్పటికీ ఉపశమనం లభించలేదని ఆయన తండ్రి సురారం యాదయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 27న విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన రమేష్ కుమార్ కడుపునొప్పి తీవ్రంగా ఉందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. ఆసుపత్రికి వెళ్లాలని తండ్రి సూచించగా మరుసటి రోజు ఉదయం వెళ్తానని చెప్పినట్లు ఫిర్యాదులో వివరించారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో కుమారుడు నిద్రలేచి బెడ్‌రూమ్‌లో తండ్రి ఉరివేసుకున్న స్థితిలో ఉండటాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు పరిశీలించగా అప్పటికే రమేష్ కుమార్ మృతి చెందినట్లు గుర్తించారు. తన కుమారుడి మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల కారణంగా ఈ ఘటన జరిగి ఉండవచ్చని తండ్రి పోలీసులకు తెలిపినట్లు సమాచారం. యాదయ్య ఫిర్యాదు మేరకు నర్సాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి గల కారణాలను నిర్ధారించేందుకు తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఏ. రంజిత్ కుమార్ తెలిపారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు వైద్యుల సలహా తీసుకోవాలని, మానసిక ఒత్తిడికి గురైనవారు కుటుంబ సభ్యులు, సన్నిహితులు లేదా వైద్య నిపుణుల సహాయం పొందాలని పోలీసులు సూచించారు.

పోలీస్ అమరవీరుల స్మరణార్థం రక్తదాన శిబిరం.. 108 మంది స్వచ్ఛంద రక్తదానం





మెదక్, అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ మెదక్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ప్రభుత్వ ఆసుపత్రి సహకారంతో బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ శిబిరాన్ని ప్రారంభించడంతోపాటు స్వయంగా రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రమాదాలు, అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సకాలంలో రక్తం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకుని స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఒక వ్యక్తి చేసే రక్తదానం మరొకరి ప్రాణాలను నిలబెట్టగలదని, సమాజ సేవలో రక్తదానం అత్యంత గొప్పదని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకునే కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన ఈ శిబిరంలో ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బంది కలిపి మొత్తం 108 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసి శిబిరాన్ని విజయవంతం చేసిన దాతలను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, రంగనాథ్, సీఐలు మహేష్, సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, ఆర్ఐలు రామకృష్ణ, శైలేందర్, పలువురు ఎస్ఐలు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మెదక్ జిల్లా చైర్మన్ తిరుమలేష్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పోక్సో చట్టంపై విద్యార్థులకు న్యాయ అవగాహన.. బాలలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవు: న్యాయమూర్తి ఎం. హేమలత

నర్సాపూర్, అక్టోబర్ 29 (సందేశం టైమ్స్ ప్రతినిధి): బాలల హక్కులు, భద్రత, రక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ ఎం. హేమలత సూచించారు. సురక్షిత్ బచ్పన్ అభియాన్‌లో భాగంగా జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మెదక్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ నేతృత్వంలో నర్సాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోక్సో చట్టంపై న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎం. హేమలత మాట్లాడుతూ బాలబాలికలు భయం లేకుండా సురక్షిత వాతావరణంలో జీవిస్తూ విద్యను అభ్యసించాలని, తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బాలల పట్ల అనభ్యంగా ప్రవర్తించడం, లైంగిక వేధింపులకు పాల్పడటం వంటి నేరాలకు పోక్సో చట్టం ప్రకారం కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్, వ్యక్తిగత భద్రత, లైంగిక వేధింపుల నివారణ, ఆన్‌లైన్ భద్రత, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, అవాంఛనీయ పరిస్థితులు ఎదురైనా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేయాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని వివరించారు. బాలల భద్రత తల్లిదండ్రుల బాధ్యత మాత్రమే కాదని, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. విద్యార్థులు చెడు అలవాట్లకు, దుశ్చర్యలకు దూరంగా ఉంటూ అప్రమత్తంగా ఉండాలని, చదువుపై పట్టుదలతో దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. శిల్ప, ఉపాధ్యాయులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బాల్యవివాహాల నివారణకు గ్రామస్థాయి కమిటీ ఏర్పాటు

అందోల్, అక్టోబర్ 29 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా అందోల్ పరిధిలోని అలమైపేట్ గ్రామంలో జెరిసి స్కోప్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్థాయి బాలల సంక్షేమం, పరిరక్షణ కమిటీ (సీడబ్ల్యూపీసీ) ఏర్పాటు చేశారు. సర్పంచ్ దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బాలల హక్కుల పరిరక్షణ, బాల్యవివాహాల నివారణపై చర్చించారు. అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కమిటీ నిర్ణయించింది. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి, వాటిని అరికట్టేందుకు గ్రామస్థులు సమన్వయంతో పనిచేయాలని తీర్మానించారు. బాలల హక్కులను కాపాడుతూ, ప్రతి బాలబాలికకు సురక్షితమైన బాల్యాన్ని అందించేందుకు గ్రామస్థాయిలో సమిష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు.





చింతకాని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి: సీపీఐ మండల సమితి డిమాండ్

చింతకాని, అక్టోబర్ 29 (సందేశం టైమ్స్ ప్రతినిధి): వర్షాభావ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయిన చింతకాని మండల రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో చింతకానికి చోటు కల్పించకపోవడం వల్ల స్థానిక రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో రైతులు పంటల సాగు కోసం వేలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టి నష్టపోయారని, ఇప్పటికే సాగు చేసిన పంటలకు ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. రెండో పంట సాగుకు అవసరమైన నీటి వనరులు అందుబాటులో లేక రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని పరిశీలించి, వర్షాభావ తీవ్రతను పరిగణనలోకి తీసుకొని చింతకాని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో పాటు రైతులకు తగిన పరిహారం అందించి, వ్యవసాయానికి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే గత శనివారం చింతకాని మండలంలోని కొదుమూరు గ్రామంలో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కను కలిసి మండలంలోని 3,800 కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందడం లేదని, అర్హులైన కుటుంబాలకు తక్షణమే ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. దళిత బంధు పథకం కింద మండలంలో 140 దళిత కుటుంబాలకు, కులాంతర వివాహాలు చేసుకున్న మరో 15 కుటుంబాలకు కలిపి మొత్తం 155 కుటుంబాలకు నిధులు మంజూరైనప్పటికీ ఇప్పటివరకు పథకం అమలు కాలేదని పేర్కొన్నారు. మంజూరైన నిధులను వెంటనే లబ్ధిదారులకు అందించి, వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కౌన్సిల్ సభ్యుడు షేక్ దస్తగిరి, నాయకులు చింతల కోటి, కోలా శ్రీను, పోరంపల్లి మురళీకృష్ణ, మక్కల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తుఫాను హెచ్చరిక.. అత్యవసరమైతేనే బయటకు రావాలి: చింతకాని ఎస్ఐ జి. నరేష్

చింతకాని, అక్టోబర్ 29 (సందేశం టైమ్స్ ప్రతినిధి): బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చింతకాని ఎస్ఐ జి. నరేష్ సూచించారు. అత్యవసర పరిస్థితులు మినహా ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వాతావరణ పరిస్థితులను గమనిస్తూ తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈదురుగాలుల కారణంగా విద్యుత్ తీగలు తెగిపడే ప్రమాదం ఉన్నందున విద్యుత్ స్తంభాలకు, తెగిపడిన తీగలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల సమీపంలో ఆశ్రయం పొందవద్దని సూచించారు. ప్రయాణాలు చేసే వారు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకర పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఎస్ఐ జి. నరేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



జనాభా గణనకు క్షేత్రస్థాయిలో పటిష్ఠ ప్రణాళిక: అదనపు కలెక్టర్ నగేష్

మెదక్, అక్టోబర్ 29(సందేశం టైమ్స్ ప్రతినిధి): జనగణన–2027ను సమర్థవంతంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో పటిష్ఠ ప్రణాళికతో ముందుకు సాగాలని అదనపు జిల్లా కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. జనాభా గణన రెండో దశ నిర్వహణలో భాగంగా అక్టోబర్ 28, 29 తేదీల్లో రెండు రోజుల పాటు మెదక్‌లోని ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, చార్జ్ అధికారులు, అదనపు చార్జ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గణన బ్లాకులు, ఉప గణన బ్లాకుల ఏర్పాటు, జనాభా గణన విధివిధానాలు, చేపట్టాల్సిన చర్యలు, అధికారుల బాధ్యతలు, గణాంకాల సేకరణ ప్రక్రియపై అధికారులకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి వచ్చిన జనగణన శాఖ అధికారులు మార్గపూడి ఉష, చించెట్టి మోనిక రెండు రోజుల పాటు శిక్షణ అందిస్తున్నారని వివరించారు. జనగణన ప్రక్రియను నిర్దేశిత నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



నలుగురు ఏఆర్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి.. మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ నరసింహ ఐపీఎస్

సూర్యాపేట, అక్టోబర్ 29 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సూర్యాపేట జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ విభాగంలో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న రాంబాబు, రామారావు, అశోక్, బషీర్ నలుగురు ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ పదోన్నతి ఉత్తర్వులను అందజేసి, మిఠాయిలు పంచి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగోన్నతితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని, అందుకు అనుగుణంగా అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించి వారి మన్ననలు పొందాలని సూచించారు. పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని, క్రమశిక్షణతో మెలుగుతూ తోటి సిబ్బందిని గౌరవించాలని, సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. విధి నిర్వహణతో పాటు ఆరోగ్యం, కుటుంబం పట్ల కూడా తగిన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ఆర్మ్డ్ డీఎస్పీ నరసింహాచారి, ఆర్ఐ ప్రవీణ్ కుమార్, పోలీసు సంఘం అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి కిరణ్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



జనగణనలో తప్పులు దొర్లకుండా పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, అక్టోబర్ 29 (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): జనగణనలో ఎలాంటి తప్పులు దొర్లకుండా అప్రమత్తంగా వ్యవహరించి, నిర్దేశిత నిబంధనల ప్రకారం ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులకు సూచించారు. జనగణన రెండో దశ నిర్వహణపై ముఖ్య ప్రణాళిక అధికారి ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు, చార్జ్ అధికారులు (తహసీల్దార్లు), అదనపు చార్జ్ అధికారులు (ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు)కు రెండో విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన రెండో దశ షెడ్యూల్, విధివిధానాలు, అధికారుల బాధ్యతలపై వివరించారు. 2027 జనవరి 10 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన రెండో దశ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జనవరి 10 నుంచి 24 వరకు స్వీయ గణన, జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు క్షేత్రస్థాయి జనగణన నిర్వహిస్తారని, ఫిబ్రవరి 28 రాత్రి ఇళ్లు లేని వారిని గణిస్తారని వివరించారు. మార్చి 1 నుంచి 5 వరకు రివిజనల్ రౌండ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జనగణనలో భాగంగా ఎన్యూమరేటర్లు ప్రతి గృహాన్ని సందర్శించి 40 రకాల ప్రశ్నలకు సంబంధించిన వివరాలను సేకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఎన్యూమరేటర్లకు సరైన సమాచారం అందించి, జనగణన విజయవంతంగా పూర్తయ్యేందుకు సహకరించాలని కోరారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం జనగణనను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, సీపీఓ కిషన్, జడ్పీ సీఈవో శిరీష, ఆర్డీవోలు వేణుమాధవ్, శ్రీనివాసులు, ట్రైనర్లు ఓబులాల్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి: ఎస్పీ నరసింహ ఐపీఎస్

సూర్యాపేట, అక్టోబర్ 29 (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి త్యాగాలకు గౌరవంగా ప్రతి పౌరుడు చట్ట పరిధిలో నడుచుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఖమ్మం చౌరస్తా నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పీఎస్ఆర్ సెంటర్, కల్నల్ సంతోష్ బాబు చౌరస్తా, కోర్టు చౌరస్తా మీదుగా ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల చౌరస్తా వరకు కొనసాగింది. జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ అధికారులతో కలిసి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో పట్టణ పౌరులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల వద్ద 'జై జవాన్, జై కిసాన్, జై పోలీస్' అంటూ నినాదాలు చేస్తూ పోలీసు అమరవీరుల ఆశయాలను సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, పోలీసులు నిర్వర్తించే కఠినమైన విధులపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అమరవీరుల త్యాగాలను నిరంతరం స్మరించుకుంటూ, వారి సేవలను ప్రజలు గుర్తుంచుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో చట్టాలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ఆర్మ్డ్ డీఎస్పీ నరసింహాచారి, సీఐలు రాజశేఖర్, వెంకటయ్య, రామారావు, శివకుమార్, ఆర్ఐలు నారాయణరాజు, ప్రవీణ్ కుమార్, జానయ్య, ఆర్ఎస్ఐ సురేష్, ఎస్ఐలు సందీప్, సాయిరాం, మహేష్, రహీముద్దిన్, కనకరత్నం, పోలీసు సంఘం అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి కిరణ్, పోలీసు సిబ్బంది, యువత పాల్గొన్నారు.

పవర్‌గ్రిడ్ సబ్‌స్టేషన్, రైతు బజార్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసిన కలెక్టర్ కృతిక శుక్ల



పల్నాడు జిల్లా, అక్టోబర్ 29 (సందేశం టైమ్స్ ప్రతినిధి): పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల బుధవారం పిడుగురాళ్ల మండల పరిధిలోని చిన్న గార్లపాడు, పెద్ద గార్లపాడు గ్రామాల్లో పర్యటించి పవర్‌గ్రిడ్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి అనువైన ప్రభుత్వ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూసేకరణకు ప్రతిపాదించిన స్థలాల సరిహద్దులు, విస్తీర్ణం, సాంకేతిక అనుకూలతకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాచెర్ల మున్సిపాలిటీలో రైతు బజార్ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. ఆయా ప్రాజెక్టులకు అవసరమైన భూముల వివరాలను సమగ్రంగా పరిశీలించి, సంబంధిత అధికారులు తదుపరి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.



మంజీరా నదిలో తల్లి, ఇద్దరు కుమార్తెల మృతి.. చిన్న ఘనపూర్ వద్ద విషాద ఘటన

మెదక్, అక్టోబర్ 29 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్న ఘనపూర్ శివారులోని ఏడుపాయల మొదటి బ్రిడ్జి సమీపంలో మంజీరా నదిలో తల్లి, ఇద్దరు కుమార్తెలు గల్లంతై మృతిచెందిన ఘటన విషాదాన్ని నింపింది. బుధవారం ఉదయం పోలీసులు వారి మృతదేహాలను వెలికితీశారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన గంగోళ్ల సరిత (27), తన కుమార్తెలు వైష్ణవి (7), సాన్విక (6)తో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. భర్త మృతిచెందడంతో కుటుంబ బాధ్యతలను సరితే నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో ఆమె తీవ్ర మనోవేదనకు గురైనట్లు, ఆధార్ కార్డులో మార్పుల కోసం పిల్లలను తీసుకుని ఏడుపాయల సమీపానికి వచ్చినట్లు బంధువులు పేర్కొన్నారు. ముగ్గురూ నదిలో గల్లంతైనట్లు సమాచారం అందడంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి: సీపీఎం జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ



మెదక్, అక్టోబర్ 29 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వరి కోతలు ప్రారంభమై సుమారు 20 రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతులు కోసిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తున్నారని, ఇటీవల వర్షాలు లేకపోవడంతో కొద్దిపాటి పంట మాత్రమే చేతికి వచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం చేతికొచ్చిన ధాన్యాన్ని అకాల వర్షాల నుంచి కాపాడుకోవాల్సిన పరిస్థితి నెలకొందని, వాతావరణ మార్పుల కారణంగా వర్షాలు కురిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేందుకు ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గోనె సంచులు, హమాలీ కార్మికులు, ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉంచాలని కె. నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మెదక్‌ను పూర్తిస్థాయి కరువు జిల్లాగా ప్రకటించాలి.. ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలి: AIKS



మెదక్, అక్టోబర్ 29 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని ఖరీఫ్ పంటలు దెబ్బతిన్నందున మెదక్ జిల్లాను పూర్తిస్థాయి కరువు జిల్లాగా ప్రకటించాలని ఆల్ ఇండియా కిసాన్ సభ (AIKS) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. రైతు సంఘం నాయకుడు ఎం.డి. సర్దార్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో పంట నష్టం జరిగినప్పటికీ ఒక్క మండలాన్నే కరువు ప్రాంతంగా ప్రకటించడం అన్యాయమని అన్నారు. పంటలు సగానికి పైగా దెబ్బతినడంతో రైతులు అప్పుల భారంలో కూరుకుపోయారని, రబీ సాగుపైనా ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించి, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతుల బ్యాంకు రుణాలను రీషెడ్యూల్ చేసి, కొత్త రుణాలు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎం.డి. సర్దార్ విజ్ఞప్తి చేశారు.



చిన్నారుల రక్షణకు పోక్సో చట్టంపై అవగాహన అవసరం: మహమ్మద్ అసదుల్లా షరీఫ్

పుల్కల్, అక్టోబర్ 29 (సందేశం టైమ్స్ ప్రతినిధి): చిన్నారులపై లైంగిక వేధింపులను అరికట్టి, వారి హక్కులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మహమ్మద్ అసదుల్లా షరీఫ్ సూచించారు. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జడ్పీహెచ్ఎస్‌లో బుధవారం 'సురక్షిత్ బచ్‌పన్ అభియాన్'లో భాగంగా పోక్సో చట్టం-2012పై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసదుల్లా షరీఫ్ మాట్లాడుతూ చిన్నారులపై లైంగిక అఘాయిత్యాలు తీవ్రమైన నేరాలని, బాధితులకు రక్షణ, న్యాయం అందించడంలో పోక్సో చట్టం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యార్థులు తమ హక్కులు, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అడ్వకేట్లు ఎస్.హెచ్.ఎన్. వర్మ, శివప్రసాద్, పుల్కల్ ఎస్సై ఎన్. విశ్వజన్ విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడాలను వివరించారు. అసౌకర్యం కలిగించే స్పర్శ ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని, అవసరమైతే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఇలాంటి సదస్సులు విద్యార్థుల్లో ధైర్యాన్ని పెంపొందించడంతో పాటు వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పిస్తాయని ప్రధానోపాధ్యాయుడు సంగమేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరువు మండలాల ప్రకటనతో సరిపెట్టొద్దు.. రైతులకు ఎకరాకు రూ.20 వేల పరిహారం అందించాలి: మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



టేక్మాల్, అక్టోబర్ 29 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కరువు మండలాలుగా ప్రకటించిన ప్రాంతాల్లో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున తక్షణ పరిహారం అందించాలని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ డిమాండ్ చేశారు. పరిహారం మొత్తం, చెల్లింపు గడువు, పంట నష్టాన్ని అంచనా వేసే విధానంపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని కోరారు. కేవలం ప్రకటనలు, జీవోలతో రైతుల సమస్యలు పరిష్కారం కావని అన్నారు. బీఆర్ఎస్ పోరాటాలు, రైతుల ఆందోళనల నేపథ్యంలో ఐదు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం స్వాగతించదగినదేనని పేర్కొంటూ, సాగునీరు, విద్యుత్ సమస్యల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని అన్నారు. కౌలు రైతులకు పరిహారం అందించడంతో పాటు రైతుల రుణాల రీషెడ్యూల్‌పై స్పష్టమైన విధివిధానాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆందోల్ నియోజకవర్గ పరిధిలోని మెదక్ జిల్లా మండలాలైన రేగోడ్, టేక్మాల్, అల్లాదుర్గాలను కరువు మండలాల జాబితాలో చేర్చకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మండలాల్లో వరి, పత్తి పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించి, రేగోడ్, టేక్మాల్, అల్లాదుర్గం మండలాలను వెంటనే కరువు మండలాలుగా ప్రకటించడంతో పాటు పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.20 వేల పరిహారం అందించాలని చంటి క్రాంతి కిరణ్ కోరారు.



దళిత ఉపసర్పంచ్‌పై వేధింపులు.. అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్

కోహీర్, అక్టోబర్ 29 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి మైసయ్య ఆరోపించారు. ప్రసాద్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా కోహీర్ మండలం సజ్జాపూర్ గ్రామ పంచాయతీకి చెందిన దళిత ఉపసర్పంచ్ మైసయ్యను సర్పంచ్ కే. పద్మావతి కుమారుడు ప్రసాద్‌రెడ్డి వేధిస్తున్నారని మైసయ్య, కోహీర్ మున్సిపల్ కౌన్సిలర్ సంపత్‌కుమార్ ఆరోపించారు. ఉపసర్పంచ్ పదవికి రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తూ బహిరంగంగా దూషించడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు పేర్కొన్నారు. సోషల్ మీడియా గ్రూపుల్లో తనను కించపరిచేలా పోస్టులు పెడుతున్నారని, గ్రామసభల్లో తన హక్కులకు భంగం కలిగిస్తున్నారని చట్టం కింద కేసు నమోదు చేసి తనకు రక్షణ కల్పించాలని కోరారు. జిల్లా కలెక్టర్, పంచాయతీ అధికారులు, రాష్ట్ర ఎస్సీ కమిషన్, మానవ హక్కుల కమిషన్ స్పందించి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కోహీర్ పోలీస్ స్టేషన్‌తో పాటు జహీరాబాద్ డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోతే దళిత, ప్రజా సంఘాలతో కలిసి ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.



పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ శివంపేటలో ఈ-వేస్ట్‌పై అవగాహన కార్యక్రమం

చౌటకూరు , అక్టోబర్ 29 (సందేశం టైమ్స్ చౌటకూరు మండల్ రీపోటర్ డి. రమేష్): సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం శివంపేట గ్రామంలోని పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ-వేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు) నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి వెలువడే వ్యర్థాల వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. ఉపయోగించలేని ఎలక్ట్రానిక్ పరికరాలను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా ప్రత్యేకంగా సేకరించి, శాస్త్రీయ పద్ధతుల్లో రీసైక్లింగ్ చేయాలని సూచించారు. ఈ-వేస్ట్‌ను నిర్లక్ష్యంగా పారవేయడం వల్ల పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యానికి కూడా హాని కలిగే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని, పర్యావరణ పరిరక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మల్లేశంతో పాటు ఉపాధ్యాయులు ఎన్. రాములు, ఎస్. రాములు, ముకుందం, మజీద్, మాణిక్యం, శైలజ, స్వప్నశ్రీ, సునీత బాయి, సునీత వేణి, నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఈ-వేస్ట్ నిర్వహణపై అవగాహన పొందారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఘనంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు



ఖమ్మం, అక్టోబర్ 29 (సందేశం టైమ్స్ జిల్లా ప్రతినిధి శెట్టి సురేష్): ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు మండలాలు, గ్రామాల్లో రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించి కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, ఎడతెరిపి లేని వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అభిమానులు, నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పేదలు, బడుగు, బలహీన వర్గాల ఆత్మబంధువుగా, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ప్రజలు అభిమానంతో 'శ్రీనన్న'గా పిలుచుకునే ఆయన నిజమైన ప్రజాసేవకుడిగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ రాజకీయాల్లో శ్రీనన్న కీలక పాత్ర పోషిస్తూ మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ప్రముఖ న్యాయవాది ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి, బీఆర్ అంబేద్కర్ ప్రజా సంఘాల నేత లింగాల రవికుమార్, టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఉమ్మినేని కృష్ణ, షేక్ ఇమామ్ బాయ్, మాజీ ఎంపీపీ గోను మధు, ఏఎంసీ మాజీ చైర్మన్ గుమ్మా రోశయ్య, కోసూరు శ్రీను, చల్లా రామకృష్ణారెడ్డి, మియా భాయ్ జిలాని, జి. నరసింహారావు, డీఎస్ఎన్ రాజు, విప్లవ్ కుమార్ పటేల్, కొప్పెర ఉపేందర్, దుర్గ మొగిలిచర్ల సైదులు, కరాటే వేణు, చింతమల్ల గురుమూర్తి, తాళ్లూరి రాము, తోట ప్రసాద్ నాయుడు, సతీష్, తిరుపతిరావు, జంగిపల్లి ప్రసాద్, కాంపాటి రమేష్, దామా స్వరూప, శ్రీకళారెడ్డి, ఆర్కే నాయుడు, సమీరా తదితర నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



అర్నబ్ తుఫాను నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ దివాకర్ టీఎస్

